
ప్రజాశక్తి

సోమవారం 6 నవంబర్ 2023

5

పార్వతీపురం మన్యం



రోడ్డు ప్రమాదంలో జర్నలిస్టు మృతి

ప్రజాశక్తి - సీతంపేట



మండలంలోని జామితోట సమీపంలో సీనియర్ జర్నలిస్ట్ గొర్లె గడ్డియ్య (45) శనివారం రాత్రి రోడ్డు ప్రమాదంలో మృతి చెందాడు. పులి పుట్టి గ్రామానికి చెందిన గడ్డియ్య సీతంపేట నుండి తన స్వగ్రామానికి ద్విచక్ర వాహనంపై వెళ్తుండగా జామితోట సమీపంలో బైకు అదుపుతప్పి బోల్తా పడి అక్కడిక్కడే మృతి చెందినట్లు ఎస్సై ఎ.నీలకంఠరావు తెలిపారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు, గడ్డియ్యకు భార్య సుజాత, పిల్లలు ఉన్నారు. ఆయన మృతి పట్ల పాలకొండ డివిజన్ పాత్రికేయులు సంతాపం తెలిపారు.



కుక్కిడిలో ఎండిపోయిన వరిపంట

వర్షాభావం... రైతుకు శాపం

కరువు కోరల్లో ఏజెన్సీ • అన్నదాతను ఆదుకోవాలి : సిపిఎం

ప్రజాశక్తి - గుమ్మలక్ష్మీపురం

ఈ ఏడాది వర్షాభావ పరిస్థితులు గిరిజన రైతులకు శాపంగా మారాయి. అనుకున్నంత స్థాయిలో వర్షాల్లేకపోవడంతో ఏజెన్సీ ప్రాంతం కరువు ప్రాంతంగా కనిపిస్తుంది. జూలై చివరి వారం నుంచి ఆగస్టు వరకు మోస్తారు వర్షాలు కురవడంతో రైతులు ఎంత ఆశతో పొలం పనులు ప్రారంభించారు. 50 శాతం వరకు వరి నాట్లు పూర్తయిన తర్వాత సెప్టెంబర్ నుంచి నేటి వరకు సరైన వర్షపాతం నమోదు కాకపోవడంతో వరి పైరు ఎండిపోయి బీడు భూములుగా మారుతుంది. రోజురోజుకు కరువు పరిస్థితులు ఏర్పడడంతో రైతులు కరువు కోరల్లో కన్నీటి పర్యంతం అవుతున్నాయి. ఏజెన్సీ ప్రాంతంలో సాగునీటి వనరుల ఉన్నా అభివృద్ధికి నోచుకోకపోవడంతో పంట పొలాలకు సాగునీరందని పరిస్థితి. దీంతో ప్రతి ఏటా రైతులు వర్షాధారం పైనే ఆధారపడి పంటలు పండిస్తుంటారు. మండలంలోని దుడ్డుఖల్లు, కొత్తవలస, దుమ్మంగి, కుక్కిడి, ఇరిడి, ఎల్విన్‌పేట, మండ తదితర ప్రాంతాల్లో పంట పొలాలకు సాగునీరందక వరి పైరు ఎండిపోతోంది. తాడికొండ, పెద్దఖర్జ, రాయగడ జమ్ము, గొరడ, చాపరాయి బిన్నిడి ప్రాంతాల్లో ఊటనీరు ఆధారంగా వరి పండుతోంది. మరో వారం రోజుల్లోగా వర్షాలు కురవకుంటే పూర్తిస్థాయిలో కరువు ఛాయలు ఏర్పడతాయని రైతులు ఆందోళన చెందుతున్నారు. మరోవైపు కురుపాం ఏజెన్సీలోనూ కరువు ఛాయలు అలుముకున్నాయి.

కరువు మండలాలుగా ప్రకటించాలి

జిల్లాలోని గుమ్మలక్ష్మీపురం, కురుపాం ఏజెన్సీ ప్రాంతాలను కరువు మండలాలుగా ప్రకటించాలి. రాష్ట్రంలో 103 ప్రాంతాలను కరువు మండలాలుగా ప్రకటించిన ప్రభుత్వం పై ఏజెన్సీ మండలాలను కరువు మండలాలుగా ప్రకటించాలి. దీనిపై ప్రభుత్వం స్పందించాలి.

కోలక అవినాష్,
ఆదివాసీ గిరిజన సంఘం జిల్లా కార్యదర్శి.

రైతులకు నష్టపరిహారమివ్వాలి

గుమ్మలక్ష్మీపురం, కురుపాం ఏజెన్సీ మండలాలను ప్రభుత్వం కరువు మండలాలుగా ప్రకటించి గిరిజన రైతులకు నష్టపరిహారం చెల్లించాలి. వేలాది రూపాయలు అప్పులు చేసి పంటలు వేసుకున్న రైతులు కరువు ఛాయలు చూసి కన్నీటి పర్యంతమవుతున్నారు.

మండంగి రమణ,
ఎంపిటిసి, చెముడుగూడ, గుమ్మ లక్ష్మీపురం మండలం.

జీతాలొకచోట... విధులు వేరోచోట

- పని ఒత్తిడిలో పలువురు ఉద్యోగులు
- సేవలు అందించడంలో జాప్యం

ప్రజాశక్తి - పార్వతీపురం టౌన్



స్థానిక మున్సిపల్ కార్యాలయంలో పలు విభాగాల ఉద్యోగులు జీతాలను ఈ మున్సిపల్ కార్యాలయం నుండి తీసుకుంటూ, విధులను మాత్రం వేరే మున్సిపల్ కార్యాలయాల్లో నిర్వహిస్తున్నారు. దీంతో ఇక్కడి కార్యాలయంలో పలు విభాగాల్లో విధులు నిర్వహిస్తున్న ఇతర అధికారులకు అదనపు పని భారం పడి తీవ్ర ఒత్తిడికి గురై అసహనం వ్యక్తం చేస్తున్నారు. వీటితో పాటు ఈ మున్సిపాలిటీలో అధికారుల కొరత కూడా ఎక్కువగానే ఉంది. పరిపాలన విభాగానికి సంబంధించి మేనేజర్ పోస్టు, టౌన్ ప్లానింగ్ విభాగానికి సంబంధించి రెండు బిల్డింగ్ ఇన్‌స్పెక్టర్ పోస్టులు, ఒక టిపిఎస్ పోస్టు ఖాళీగా ఉంది. అలాగే ఇద్దరు సీనియర్ అసిస్టెంట్లు ఇక్కడ జీతాలు తీసుకుంటూ నెలిమర్ల, రాజాం నగర పంచాయితీల్లో విధులు నిర్వహిస్తున్నారు. సీనియర్ అకౌంటెంట్‌గా ఈ మున్సిపాలిటీలో విధులలో చేరిన సత్యవతి డిప్యూటేషన్‌పై జివిఎంసిలో విధులు నిర్వహిస్తున్నారు. జూనియర్ అసిస్టెంట్‌గా ఇక్కడ జీతం తీసుకుంటూ డిప్యూటేషన్‌పై బొబ్బిలి మున్సిపాలిటీలో విధులు నిర్వహిస్తున్న ఎంపి శైలజ డిప్యూటేషన్ రద్దయిన అక్కడే విధులు నిర్వహిస్తుండడం విశేషం. ఇటీవల ఒక జూనియర్ అసిస్టెంట్ విధుల నిర్వహణలో అలసత్వంతో సస్పెండ్ అయి సాలూరు మున్సిపాలిటీకి పోస్టింగ్ ఇవ్వడంతో ఏర్పడిన ఖాళీతో పాటు ఒక కంప్యూటర్ ఆపరేటర్ పోస్టు కూడా ఖాళీలు ఉన్నాయి. అనధికారకంగా పట్టణ జనాభా 70 వేలు దాటింది. ఈ మున్సిపాలిటీ జిల్లా కేంద్రంగా ఆవిర్భవించింది. అయినా అభివృద్ధి పథంలో పరుగులు పెట్టాల్సి పరిస్థితుల్లో ఉద్యోగుల కొరత పట్టి పీడిస్తోంది. అంతేకాక పలు విభాగాల ద్వారా పట్టణ ప్రజలకు అందాల్సిన సేవలు సకాలంలో జరగడంలేదనే విమర్శలు కూడా వెల్లువెత్తుతున్నాయి. రానున్న సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో అధికారుల పాత్ర చాలా ముఖ్యం. కావున ఈ విషయంపై స్థానిక పాలకవర్గ కౌన్సిల్ సభ్యులతో పాటు మున్సిపల్ కమిషనర్ జె.రామఅప్పలనాయుడు దృష్టి పెట్టి ప్రత్యేక కార్యాచరణ రూపొందించి డిప్యూటేషన్‌పై విధులు నిర్వహిస్తున్న సంబంధిత అధికారులను మున్సిపల్ కార్యాలయానికి రప్పించేలా చర్యలు చేపడితే కార్యాలయంలో జరగాల్సిన పనులు సకాలంలో జరిగే అవకాశం ఉంటుంది. పని ఒత్తిడి కూడా ఉండే అవకాశం ఉండదని కార్యాలయంలో ఉన్న పలు విభాగాలు అధికారులు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు. ఈ విషయంపై మున్సిపల్ కమిషనర్ జె.రామఅప్పలనాయుడును వివరణ కోరగా మూడు సార్లు ఆర్‌డిఎం దృష్టికి తీసుకెళ్లామని, ఉన్నతాధికారుల నుంచి ఆదేశాలు రావాలని అన్నారు.



ఉపాధ్యాయుల భారీ ర్యాలీ

సమస్యలపై ఐక్యపోరాటాలు

ఓట్‌ఫర్ జిపిఎస్ రద్దు • సభలో వక్తలు పిలుపు

• ఉత్సాహంగా యుటిఎఫ్ స్వర్ణోత్సవ వేడుకలు



సభలో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ వైవి



మాట్లాడుతున్న రాష్ట్ర అధ్యక్షులు వెంకటేశ్వరరావు


ప్రజాశక్తి - పార్వతీపురం

విద్యార్థి, ఉపాధ్యాయ సమస్యలపై ఐక్యపోరాటాలకు సిద్ధం కావాలని, జిపిఎస్ రద్దు చేసే రాజకీయ పార్టీకే తమ ఓటని యుటిఎఫ్ నాయకులు స్పష్టం చేశారు. యుటిఎఫ్ 50వ స్వర్ణోత్సవాల్లో భాగంగా స్థానిక డిఇఒ కార్యాలయం నుంచి సభావేదికైన స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాల వరకు డప్పులు, గిరిజన నృత్య ప్రదర్శనలతో భారీ ర్యాలీగా ఉపాధ్యాయులు వచ్చారు. కొమరాడ గిరిజన సంక్షేమ ఆశ్రమ బాలికోన్నత పాఠశాలల విద్యార్థినిలు ప్రదర్శించిన 'పాడుదమా స్వేచ్ఛాగీతం' పాటకు నృత్యం, థింసా నృత్యం ఆహూతులను అలరించాయి. యుటిఎఫ్ సభ్యులు నాగభూషణం తుడుము దరువుతో ఊరేగింపు జరిగింది. అనంతరం ప్రభుత్వ జూనియర్ కళాశాల ఆవరణలో యుటిఎఫ్ జెండాను ఆ సంఘం జిల్లా గౌరవ అధ్యక్షులు ఆరిక భాస్కరరావు ఆవిష్కరించారు. అనంతరం సంఘం జిల్లా అధ్యక్షులు టి.రమేష్ అధ్యక్షతన జరిగింది. ఈ ఉత్సవాలకు ముఖ్యఅతిథిగా విచ్చేసిన రాష్ట్ర ఎస్‌టి కమిషన్ చైర్మన్ డాక్టర్ డివి శంకర్రావు మాట్లాడుతూ తరగతి గదిలో దేశ భవిష్యత్తు తీర్చిదిద్దుకునే మహోన్నతమైన కార్యరంగంలో పనిచేస్తున్న ఉపాధ్యాయులు సమాజానికి ఆదర్శమని అన్నారు. పిడిఎఫ్ ఎమ్మెల్సీ ఐ.వెంకటేశ్వర్లు మాట్లాడుతూ పార్వతీపురం మన్యం ఎర్రజెండా ఉద్యమాలకు పురిటిగెడ్డ అన్నారు. ఈ జిల్లాలో అత్యధిక మండలాలు గిరిజన ప్రజల నివసించేవి గాను ఉన్నాయని, ఇక్కడ గిరిజనులను దోచుకొనే భూస్వాములను అడ్డుకునేందుకు చౌదరి తేజేశ్వరరావు, ఆదిభట్ల కైలాసం, వెంపటాపు సత్యం వంటి వారు పోరాడారన్నారు. వీరి పోరాట ఫలితంగా ఐటిడిఎ, జిసిసి, 1/70 చట్టాలు వచ్చాయన్నారు. అయినా గిరిజనుల బతుకులు మారలేదని, వాటిని మార్చాలంటే ఉపాధ్యాయుల వల్లే సాధ్యమని అన్నారు. అందుకు ఉపాధ్యాయులు విద్యార్థులకు సమాజంపై అవగాహన పెంచేలా చూడాలన్నారు. యుటిఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు నక్కా వెంకటేశ్వరరావు మాట్లాడుతూ యుటిఎఫ్ 50వ స్వర్ణోత్సవాలు రాష్ట్రవ్యాప్తంగా జరపాలని రాష్ట్ర కమిటీ నిర్ణయించిందన్నారు. అందులో భాగంగానే జిల్లాలో ఈ స్వర్ణోత్సవాలు జరుగుతున్నాయన్నారు. ఈ స్వర్ణోత్సవాలు మన్యం జిల్లాలో జరుపుకోవడమే కాకుండా మరో 50 ఏళ్ల యుటిఎఫ్ ఉద్యమాలను ముందుకు తీసుకెళ్లాలన్నారు. ఈ గిరిజన ప్రాంతంలో గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాలలో విద్యార్థులకు మెనూ చార్జీలు పెంపునకై పోరాడగా, కొంతమేరకు ప్రభుత్వం పెంచినా ఇంకా అసంపూర్తిగానే ఉందన్నారు. భాషా విద్యా వాలంటీర్లు, సిఆర్‌టిలను రెగ్యులర్ చేయడంలో ప్రభుత్వం అలసత్వం వహిస్తుందన్నారు. వీటన్నింటిపై రానున్న రోజుల్లో ఐక్య పోరాటాలు చేసి సాధించుకోవాలని పిలుపునిచ్చారు. పార్వతీపురం నియోజకవర్గ టిడిపి ఇన్చార్జి బోనల విజయచంద్ర మాట్లాడుతూ యుటిఎఫ్ ఉద్యమాలకు తాము అండగా నిలుస్తామన్నారు. జెఎసి జిల్లా చైర్మన్ కిషోర్ మాట్లాడుతూ సిపిఎస్ రద్దుకు యుటిఎఫ్ అలుపెరగని పోరాటం చూస్తుందని, వీరి పోరాటాలకు జెఎసి తరపున సంపూర్ణ మద్దతు తెలుపుతున్నామన్నారు. సభలో గిరిజన సంక్షేమశాఖ డిడి కె.శ్రీనివాసరావు, ప్రముఖ రచయిత గంటేడ గౌరినాయుడు, సిఐటియు జిల్లా సీనియర్ నాయకులు ఎం.కృష్ణమూర్తి, యుటిఎఫ్ రాష్ట్ర కార్యవర్గసభ్యులు ఎస్.మురళీమోహనరావు, రాష్ట్రకార్యదర్శి చౌదరి రవీంద్ర, నాయకులు డి.రాము, జిల్లా కార్యదర్శులు, ఆఫీసుబేరర్లు, పెద్దసంఖ్యలో ఉపాధ్యాయు పాల్గొన్నారు.





యుటిఎఫ్ జెండాను ఆవిష్కరిస్తున్న భాస్కరరావు ; తుడుము దరువు వేస్తున్న యుటిఎఫ్ నాయకులు, నృత్యం చేస్తున్న విద్యార్థినులు



పోటీలను ప్రారంభిస్తున్న ఎంపిపి భాను

సచివాలయ ఉద్యోగుల్లో క్రికెటోత్సాహం

ప్రజాశక్తి - పాలకొండ

మండలంలోని మంగళాపురం నాగావళి నది ఒడ్డున పాలకొండ రూరల్, అర్బన్ సచివాలయ ఉద్యోగులు క్రికెట్ టోర్నీ నిర్వహించారు. ఈ టోర్నీని ఎంపిపి బొమ్మాళి భాను, వైస్ ఎంపిపిలు కనపాక సూర్యప్రకాశ్ వాకమూడి అనిల్ ప్రారంభించారు. మండలంలో గల సచివాలయ ఉద్యోగులంతా కలిసి నాలుగు జట్లుగా విడిపోయి క్రికెట్ ఆడడం శుభపరిణామమని, క్రీడలు మనలో నూతనోత్తేజాన్ని పెంపొందిస్తాయని వారు పేర్కొన్నారు. విజేతలకు బహుమతులను పంచి శుభాకాంక్షలు తెలియజేశారు. కార్యక్రమంలో మంగళాపురం ఎంపిటిసి ప్రతినిధి మజ్జి నవీన్‌కుమార్, గ్రామ పెద్దలు గోగుల శ్రీను, గార రాంబాబు, యువత పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

గణిత ప్రతిభా పరీక్షలకు 79 మంది హాజరు

ప్రజాశక్తి - భామిని

మండల స్థాయి గణిత ప్రతిభా పరీక్షను గణిత ఉపాధ్యాయ వేదిక ఆధ్వర్యంలో స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఆదివారం జరిగింది. ఈ పరీక్షకు పెద్దదిమిలి, బాలేరు, భామిని, బత్తిలి మోడల్ స్కూల్, కెబివివి, ఎపిఎస్‌డబ్ల్యుఎస్ఆర్ఎస్ నుంచి 79మంది విద్యార్థులు పాల్గొన్నారు. ఈ పోటీల్లో పదో తరగతి విభాగంలో మొదటి 5స్థానాల్లో ఎల్.పవన్ కుమార్ (బాలేరు), ఎం.దామోదర నాయుడు (భామిని), వి.రుజత, జి.సాయిలక్ష్మి (ఎపి మోడల్ స్కూల్), ఆర్.శిరీష (బత్తిలి) ప్రతిభ కనబరిచారు. 9వ తరగతలో మొదటి 5స్థానాల్లో సంతోష్ కుమార్, టి.సాయి నిశాంత్, టి.సాయినిఖిల్, జి.కరుణశ్రీ ఎపి మోడల్ స్కూల్, ఐదో స్థానంలో కె.శేఖర్(పెద్దదిమిలి) విద్యార్థులు సాధించారు. కార్యక్రమంలో గణిత శాస్త్ర ఉపాధ్యాయులు కె.మిన్నారావు, గణేష్, కె.త్రినాథరావు, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.



ప్రతిభా పోటీల్లో పాల్గొన్న విద్యార్థులు

ఓటరు నమోదు పరిశీలించిన జెసి

ప్రజాశక్తి - పార్వతీపురంరూరల్/సీతానగరం/సాలూరు/పాచిపెంట

ప్రత్యేక ఓటరు నమోదు కార్యక్రమాన్ని జాయింట్ కలెక్టర్ ఆర్.గోవిందరావు ఆదివారం పరిశీలించారు. పార్వతీపురం మండలం నర్సిపురంలో గల 54, 55, 56 పోలింగ్ కేంద్రాలు, సీతానగరం మండల కేంద్రంలో 111, 144, 145, 146 పోలింగ్ కేంద్రాలు, సాలూరు మండలం జీగిరాంలోని 54వ పోలింగ్ కేంద్రం, పాచిపెంట మండల కేంద్రంలో 95, 96 పోలింగ్ కేంద్రాల్లో ఓటరు నమోదును ఆయన పరిశీలించారు. ఓటరు నమోదు వివరాలను బూత్ స్థాయి అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రత్యేక ఓటరు నమోదు కార్యక్రమం ఈనెల 4,5 తేదీల్లో చేపట్టడం జరిగిందన్నారు. డిసెంబరు 2,3 తేదీల్లోనూ ప్రత్యేక ఓటరు నమోదు కార్యక్రమం చేపట్టడం జరుగుతుందన్నారు. 2024 జనవరి 1 నాటికి ఓటరుగా అర్హత కలిగిన ప్రతి ఒక్కరూ ఓటరుగా నమోదు చేసుకోవాలని ఆయన పిలుపునిచ్చారు. యువత ఓటరుగా నమోదుకు ముందుకు రావాలని కోరారు. ఇప్పటి వరకు ఓటరుగా నమోదు చేసుకోని వారు, ఓటరు జాబితాలో పేరు లేని వారు ఓటరుగా నమోదు చేసుకోవాలని ఆయన పేర్కొన్నారు. అక్టోబరు 27న ముసాయిదా ఓటరు జాబితాను విడుదల చేయడం జరిగిందని, ముసాయిదా ఓటరు జాబితాపై క్లైములు, అభ్యంతరాలను డిసెంబరు 9 వరకు స్వీకరించడం జరుగుతుందన్నారు. డిసెంబరు 26 నాటికి వాటిని పరిష్కరించడం జరుగుతుందని, 2024 జనవరి 5న తుది జాబితా ప్రచురణ సిద్ధం అవుతుందని జాయింట్ కలెక్టర్ స్పష్టం చేశారు. ప్రత్యేక ఓటరు నమోదు కార్యక్రమం రోజుల్లో పోలింగ్ కేంద్రాలు వద్ద బూత్ స్థాయి అధికారులు ఉంటారని ఆయన పేర్కొన్నారు. బూత్ స్థాయి అధికారులు వద్ద ఫారం - 6, ఫారం - 7, ఫారం - 8 అందుబాటులో ఉంటాయని ఆయన చెప్పారు. ఒకేసారి పెద్ద ఎత్తున ఓటరు నమోదు దరఖాస్తులు స్వీకరించడం జరగదని ఆయన స్పష్టం చేశారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన పిలుపునిచ్చారు. బూత్ స్థాయి అధికారులు ఓటరు నమోదు అంశంలో పక్కాగా ఉండాలని ఆయన స్పష్టం చేశారు. కార్యక్రమంలో సంబంధిత అధికారులు, బూత్ స్థాయి అధికారులు పాల్గొన్నారు. ఆయన వెంట ఆయా మండలాల ఎన్నికల తహశీల్దార్లు, తహశీల్దార్లు, బిఎల్ఒలు పాల్గొన్నారు.



ఓటర్ల నమోదును పరిశీలిస్తున్న జెసి గోవిందరావు

సీతంపేట : ప్రత్యేక ఓటరు నమోదు కార్యక్రమంలో భాగంగా ఐటిడిఎ పిఒ కల్పనా కుమారి మండలంలోని హడ్డుబంగిలోని 5వ నంబర్ పోలింగ్ కేంద్రాన్ని, పులిపుట్టిలోని 10వ నెంబర్ పోలింగ్ కేంద్రాన్ని, ముకుందాపురంలోని 11వ పోలింగ్ కేంద్రాన్ని ఆదివారం పరిశీలించారు. ప్రతి పోలింగ్ స్టేషన్లో సంబంధిత ఓటర్ల జాబితాను తప్పనిసరిగా ప్రదర్శించాలని, అదే విధంగా కొత్తగా ఓటర్లు ఉంటే వెంటనే నమోదు చేయించేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. ఓటర్లకు అవగాహన కల్పించాలని అన్నారు. ఓటర్ల జాబితాలో ఇంకా ఏమైనా తప్పులు ఉంటే సరిదిద్దాలని సూచించారు. కార్యక్రమంలో ఉప తహశీల్దార్ నాగేంద్ర కుమార్, బిఎల్ఒలు ఉన్నారు.

పార్వతీపురంటౌన్ : ప్రత్యేక ఓటరు నమోదు కార్యక్రమాన్ని ఆర్‌డిఒ కె.హేమలత ఆదివారం పరిశీలించారు. పట్టణంలోని 23, 24, 25, 37, 38, 39 పోలింగ్ కేంద్రాల్లో ఓటరు నమోదును పరిశీలించారు. ఓటరు నమోదు వివరాలను బూత్ స్థాయి అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ డిసెంబరు 2,3 తేదీల్లో ప్రత్యేక ఓటరు నమోదు కార్యక్రమం చేపట్టడం జరుగుతుందన్నారు. 2024 జనవరి 1 నాటికి ఓటరుగా అర్హత కలిగిన ప్రతి ఒక్కరూ ఓటరుగా నమోదు చేసుకోవాలని పిలుపునిచ్చారు. యువత ఓటరుగా నమోదుకు ముందుకు రావాలని కోరారు. 2024 జనవరి 5న తుది జాబితా ప్రచురణ సిద్ధం అవుతుందని ఆమె స్పష్టం చేశారు. కార్యక్రమంలో సంబంధిత అధికారులు, బూత్ స్థాయి అధికారులు పాల్గొన్నారు.

గుమ్మలక్ష్మీపురం : మండలంలో ఓటర్ల నమోదు ప్రక్రియ వేగవంతంగా పూర్తి చేయాలని పాలకొండ ఆర్‌డిఒ ఎం.లావణ్య రెవెన్యూ అధికారులకు సూచించారు. గుమ్మలక్ష్మీపురంలోని పోలింగ్ స్టేషన్ల నెంబర్ 74, 75 ఓటరు నమోదు కేంద్రాన్ని సందర్శించారు. 18 ఏళ్లు నిండిన ప్రతి ఒక్కరు ఓటు హక్కు వినియోగించుకోవాలని కోరారు. కార్యక్రమంలో సర్పంచ్ బొత్తాడ గౌరీ శంకరరావు, బిఎల్ఒలు, విఆర్ఒ హరికృష్ణ, మహిళా పోలీస్ అల్లక లక్ష్మి ఉన్నారు.

కురుపాం : నియోజకవర్గంలో ఓటర్లు నమోదు కార్యక్రమం ప్రత్యేక డ్రైవ్ నిర్వహించారు. అలాగే ముసాయిదా ఓటర్ల జాబితా బూత్ లెవెల్ స్థాయిలో పబ్లికేషన్ చేశారు. నియోజకవర్గంలో 397 మంది కొత్తగా ఓటర్లు నమోదు దరఖాస్తులు చేసుకోగా, 64 తొలగింపులు, పేర్లు సవరణకు 193 మంది దరఖాస్తులు చేసుకున్నారు. ఈ సందర్భంగా కురుపాం జిల్లా పరిషత్ పాఠశాల వద్ద ఏర్పాటు చేసిన ఓటర్లు నమోదు కార్యక్రమంలో ఓటర్లు నమోదు సూపర్‌వైజర్, ఎపిఒ పి.బావాజీ పరిశీలించారు. కార్యక్రమంలో బిఎల్ఏలు సూర్య, పైడిరాజు, రోజా, అనిత తదితరులు పాల్గొన్నారు.

'ఎత్తిపోతల' ద్వారా సాగునీరందించాలి

ప్రజాశక్తి - కొమరాడ

జంఝావతి జలాశయం ద్వారా ఎత్తిపోతల పథకంలో భాగంగా రైతులకు సాగునీరు అందించాలని టిడిపి అరకు పార్లమెంటరీ రైతు అధ్యక్షులు దేవకోటి వెంకట నాయుడు అన్నారు. మండలంలోని రాజ్యలక్ష్మీపురం గ్రామ పరిధిలో గల వాసిరెడ్డి కృష్ణమూర్తి రిజర్వాయర్ ఎడమ కాలువ ఎత్తిపోతల పథకం జనసేన టిడిపి ఆధ్వర్యంలో ఆదివారం నిరసన చేపట్టారు. ఎత్తిపోతల పథకం కింద సాగునీరందాల్సిన పరిస్థితిలో కరెంట్ బిల్లు కట్టలేదని ట్రాన్స్‌ఫార్మర్ కొత్తది వేయాలని, రూ.5 లక్షలు ఖర్చు అవుతుందని సాకులు చెప్పి సుమారు 3వేల ఎకరాలకు సాగునీరందించకుండా రైతులను నష్టపర్చడం భావ్యం కాదన్నారు. రైతాంగానికి అండగా నిలబడ్డానికి ప్రభుత్వంపై ఒత్తిడి పెంచడం కోసం రైతు గర్జన కార్యక్రమాన్ని జనసేన, తెలుగుదేశం సంయుక్తంగా నిర్వహించాయని వారు తెలిపారు. వైసీపీ ప్రభుత్వం ఏర్పడిన తర్వాత రైతులకు పూర్తిస్థాయిలో సాగునీరందించే పరిస్థితి కనిపించడం లేదన్నారు. ఎత్తిపోతల పథకం ద్వారా చివర రైతులకు సాగునీరు అందుకే తీవ్ర ఇబ్బందులు పడుతున్నా పాలకులు, అధికారులు కనీసం స్పందించకపోవడం చాలా దుర్మార్గమని అన్నారు. కనీసం సాగునీరు వెళ్లేందుకు కాలువ పనులు కూడా సక్రమంగా లేకపోతే నీరు ఎలా రైతులకు అందుతుందని ప్రశ్నించారు. తక్షణమే అధికారులు స్పందించి రైతులకు పూర్తిస్థాయిలో సాగునీరందించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో టిడిపి నాయకులు నంగి రెడ్డి మధుసూదన్ రావు, నందివాడ కృష్ణబాబు, అరకు పార్లమెంట్ ఉపాధ్యక్షులు మరిశర్ల సింహచలం, జనసేన జిల్లా కార్యక్రమల నిర్వహణ కార్యదర్శి పెంట శంకరరావు తదితరులు ఉన్నారు.



నిరసన తెలుపుతున్న టిడిపి, జనసేన నాయకులు



ఎండిపోయిన వరిపంటను పరిశీలిస్తున్న టిడిపి, జనసేన నాయకులు

కరువు కనిపించలేదా? : టిడిపి

ప్రజాశక్తి - సాలూరురూరల్

రాష్ట్రంలో ప్రస్తుతం వర్షాల్లేక పంటలు ఎండిపోతున్నా అసలు రాష్ట్రంలో వ్యవసాయ శాఖా మంత్రి ఉన్నారా అన్న అనుమానం కలుగుతోందని సాలూరు నియోజకవర్గ టిడిపి ఇన్‌ఛార్జి గుమ్మడి సంధ్యారాణి ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. మండలంలోని జీగిరాం, నెలిపర్తిలో జనసేన, టిడిపి నాయకులు ఎండిన వరి పొలాలను పరిశీలించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ లక్షల ఎకరాల్లో పంటలు ఎండిపోతున్నా ప్రభుత్వం పట్టించుకోకపోవడం దారుణమన్నారు. వ్యవసాయమే ప్రధాన జీవనధారంగా బతికే రైతులు గురుంచి కేబినెట్‌లో చర్చించకపోవడం ఈ ప్రభుత్వానికి రైతుల శ్రేయస్సు పట్ల ఎంత శ్రద్ధ ఉందో అర్థమవుతుందన్నారు. ఎంత సేపు ముఖ్యమంత్రి భజన, ప్రతిపక్ష నాయకులపై లేనిపోని ఆరోపణలు చేయడమే తప్ప కనీసం వారి శాఖల పట్ల అవగాహన లేదని, ఇప్పటికైనా పాలకులు కళ్లు తెరిచి అరకు పార్లమెంట్ పరిధిలో ఉన్న మండలాలను కరువు మండలాలు గా ప్రకటించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో మండల టిడిపి అధ్యక్షులు ఆమదాల పర మేష్, పట్టణ అధ్యక్షులు నిమ్మాది చిట్టి, ఎంపిటిసి సభ్యులు రమాదేవి, యుగంధర్, డబ్బి కష్ణ, శ్రీను, జనసేన నాయకులు శివ, జగదీష్, పరశురామ్, గోపి నాయకులు రైతులు పాల్గొన్నారు



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే జోగారావు

బస్సుయాత్రను విజయవంతం చేయండి : ఎమ్మెల్యే

ప్రజాశక్తి - సీతానగరం

వైసిపి ప్రభుత్వం గత నాలుగున్నర ఏళ్లలో బిసి, ఎస్సీ, ఎస్టీ, మైనారిటీలకు చేసిన మేలును ప్రజలకు వివరించేందుకు గాను రాష్ట్ర వ్యాప్తంగా తలపెట్టిన సామాజిక సాధికార యాత్ర పార్వతీపురం నియోజకవర్గంలో ఈనెల 10న జరగనుందని స్థానిక ఎమ్మెల్యే అలజంగి జోగారావు అన్నారు. ఈ యాత్రను జయప్రదం చేసేందుకు నియోజకవర్గ పరిధిలో గల అన్ని మండలాల వారీగా సన్నద్ధత సమావేశాలు నిర్వహిస్తున్నామన్నారు. ఇందులోభాగంగా ఆదివారం సీతానగరం మండలం వైసిపి అధ్యక్షులు బొంగు చిట్టి రాజు ఆధ్వర్యంలో ప్రజా ప్రతినిధులు, నాయకులతో ప్రత్యేక సమావేశమై బస్సు యాత్ర కార్యక్రమం షెడ్యూల్‌పై వివరించినట్టు తెలిపారు. వైసీపీ శ్రేణులు పెద్ద యెత్తున పాల్గొనిపార్వతీపురం ప్రధాన వేదిక వద్దకు చేరుకుని కార్యక్రమం విజయవంతం చేయాలని ఎమ్మెల్యే కోరారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ బాబ్జి, ఎంపిపి ప్రతినిధి బలగ శ్రీరాములునాయుడు, పలువురు సర్పంచులు, ఎంపిటిసి సభ్యులు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

చదవడం మాకిష్టం

ప్రజాశక్తి - గరుగుబిల్లి

స్థానిక శాఖా గ్రంథాలయంలో చదవడం మాకిష్టం అనే కార్యక్రమాన్ని ఆదివారం నిర్వహించినట్లు గ్రంథాలయ నిర్వాహకులు నల్ల మధుసూదన రావు తెలిపారు. కార్యక్రమంలో అమరజీవి పొట్టి శ్రీరాములు జీవిత చరిత్ర విద్యార్థిని, విద్యార్థులు చదివారన్నారు. అలాగే క్రీడా పోటీలు క్విజ్ పోటీలు నిర్వహించామన్నారు. కార్యక్రమంలో 16 మంది విద్యార్థులు పాల్గొన్నారని తెలిపారు.



వృద్ధులకు దుప్పట్లు అందజేస్తున్న సర్పంచ్ సుగుణ, దాత కృష్ణమూర్తి

వృద్ధులకు దుప్పట్లు పంపిణీ

ప్రజాశక్తి - కొమరాడ

చలికాలంలో వృద్ధులు ఇబ్బంది పడకుండా దుప్పట్లు, రగ్గులను పార్వతీపురం పట్టణ పోలీసు స్టేషన్ వృద్ధమిత్ర కో-ఆర్డినేటర్ కె.కృష్ణమూర్తి ఆదివారం అందజేశారు. మండలంలో కోటిపాం పంచాయతీ పరిధిలో గల దేవునిగుంపా, గదబవలస గ్రామాల్లోని 40మంది పేద మహిళా వృద్ధులకు కోటిపాం సర్పంచ్ సుంకరి సుగుణ చేతుల మీదుగా అందజేశారు. ఈ సందర్భంగా కృష్ణమూర్తి మాట్లాడుతూ ప్రతినెలా తనకు వచ్చిన జీతంలో సగానికి పైగా డబ్బును పేదల కోసం ఖర్చు చేస్తున్నట్లు తెలిపారు. జిల్లాలో ఏ ఇబ్బందుల్లో ఉన్నా పేదలను ఆదుకునేందుకు తన వంతు సహాయం ఎప్పుడూ ఉంటుందన్నారు. చలికాలంలో వృద్ధులు ఇబ్బంది పడకుండా ఉండేందుకు రగ్గులతో పాటు గ్లాసులు అందజేశామని తెలిపారు. ఈ సందర్భంగా నిత్యా సేవకుడిగా పేరు తెచ్చుకున్న కృష్ణమూర్తిని గ్రామస్తులు అభినందించారు.

విద్యార్థులకు ప్రకృతి వ్యవసాయ పాఠాలు

ప్రజాశక్తి - పాచిపెంట

మొక్కలు నాటి చెట్లను పరిరక్షించి ప్లాస్టిక్‌ను దూరం చేయడం ద్వారా ప్రకృతిని కాపాడుకోవచ్చని మండల వ్యవసాయ అధికారి కె.తిరుపతిరావు అన్నారు. మండలంలోని పాంచాలిలో గ్రామ సంరక్షణ నిధి సంస్థ అధ్యక్షులు రామకృష్ణ అధ్యక్షతన విద్యార్థులకు, వారి తల్లిదండ్రులకు ఏర్పాటు చేసిన ప్రకృతి వ్యవసాయ అవగాహన కార్యక్రమంలో మాట్లాడారు. పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని, చెత్తను వీధుల్లో పారవేయకుండా చూడాలని తద్వారా ఆరోగ్యవంతమైన జీవితాన్ని గడపాలని తెలిపారు. పశువులు గతంలో ప్లాస్టిక్, పాలిథిన్ కలపడం వల్ల రైతు మిత్రుడైన వానపాము చనిపోవడం కాకుండా జీవ వైవిధ్యం పూర్తిగా దెబ్బతిని పర్యావరణానికి ప్రమాదం ఏర్పడుతుందని తద్వారా ఉష్ణోగ్రతలు పెరిగి నీటి కొరత ఏర్పడుతుందని, వరదలు కరువులు పెరుగుతాయని తెలిపారు. అనంతరం ప్రకతి సేద్య డివిజనల్ యాంకర్ యశోదమ్మ రసాయనాలు వాడకుండా తూటికాడ కషాయంతో వరిలో దోమపోటును నివారించే విధానం గురించి వివరించారు. కార్యక్రమంలో సిఆర్పి తిరుపతి నాయుడు తూటికాడ కషాయం తయారీని రైతులకు చూపించారు.



కషాయాల తయారీపై అవగాహన కల్పిస్తున్న వ్యవసాయాధికారులు

క్వారీ పేలుళ్లు.. ఇళ్లకు పగుళ్లు

- సమీప గ్రామాల గిరిజనుల్లో ఆందోళన
- పంటలు, తోటలు నాశనమవుతున్నాయని ఆవేదన
- కలెక్టర్‌కు త్వరలో ఫిర్యాదు: సర్పంచ్



కరాసువలస వద్ద ఉన్న క్వారీ

ప్రజాశక్తి - సాలూరు

మండలంలోని కరాసువలస పంచాయతీ పరిధిలో గుర్రపువలస సమీపానున్న క్వారీ పేలుళ్లతో ఇళ్లు బీటలు వారుతున్న పరిస్థితి కనిపిస్తోంది. ఈ మేరకు సమీప గ్రామాల గిరిజనుల్లో ఆందోళన వ్యక్తమవుతోంది. క్వారీ చుట్టూ ఉన్న భూముల్లో జీడి, మామిడి తోటలు, ఇతర పంటలు నాశనమవుతున్నాయని గిరిజనులు ఆవేదన చెందుతున్నారు. 2018లో ఇక్కడ క్వారీ ఏర్పాటు చేశారు. పట్టణానికి చెందిన ఓ వ్యాపారి ఇక్కడ క్వారీ ఏర్పాటు చేశారు. మొదట్లో క్వారీ ఏర్పాటుపై సమీప గ్రామాల గిరిజనులు వ్యతిరేకించినా క్రమేణా యజమాని వారిని ప్రసన్నం చేసుకున్నారు. గడచిన నాలుగేళ్లుగా క్వారీలో పిక్క రాయి, క్వారీ డస్ట్ అమ్మకాలు చేస్తున్నారు. రాత్రి వేళల్లో క్వారీలో రాయిని పేల్చడంతో ఆ అదురుకు సమీపాన గల గుర్రపువలసలో గిరిజనుల ఇళ్లు బీటలువారుతున్నాయి.



పేలుళ్లతో బీటలు వారిన గోడ

దీంతో వారు తీవ్ర ఆందోళనకు గురవుతున్నారు. ఏటా లక్షలాది రూపాయలు వ్యాపారం చేసుకుంటున్న యజమాని చుట్టూ ఉన్న భూముల్లో పంటలు దెబ్బతినకుండా కనీస చర్యలు తీసుకోవడం లేదనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. క్వారీ ఏర్పాటుకు ముందు పచ్చని తోటలు, పంటలతో ఉండే భూములు బీడువారుతున్నాయి. దీంతోపాటు శబ్ద, వాయు కాలుష్యాలతో గిరిజనులు అనారోగ్యానికి గురవుతున్నారు. క్వారీ సమీపంలో ఉన్న గుర్రపువలసలో వంద గిరిజన కుటుంబాలు ఉంటున్నాయి. ఈ గ్రామం క్వారీకి 500మీటర్ల దూరంలో ఉంటుంది. యంత్రాలతో పిక్క రాయి తయారు చేస్తుండడంతో సమీపంలో ఉన్న పంట భూములు దుమ్మూ, ధూళితో కప్పేయబడుతున్నాయి. ఫలితంగా ఫలసాయం తగ్గి గిరిజన రైతులు తీవ్రంగా నష్టపోతున్నారు.

ఎకరానికి రూ.3వేలు శిస్తు

క్వారీ చుట్టూ భూములున్న రైతులకు క్వారీ యాజమాన్యం ఏటా రూ.3వేలు శిస్తుగా ఇచ్చి చేతులు దులుపుకొంటోంది. క్వారీ ఏర్పాటు చేసినప్పటి నుంచి రూ.3వేలు మాత్రమే శిస్తుగా యజమాని ఇస్తున్నారు. దీంతో గిరిజన రైతులు తీవ్రంగా నష్టపోయే పరిస్థితి ఏర్పడింది. క్వారీ కొండ చుట్టూ సుమారు 30ఎకరాలకు సంబంధించిన రైతులకు ఏటా నామమాత్రపు శిస్తును యజమాని చెల్లిస్తున్నారు. గుర్రపులస, కరాసువలస గ్రామాలకు చెందిన రైతుల భూములు ఈ కొండ చుట్టూ వున్నాయి. గడివలస వరకు ఈ క్వారీకి దుమ్ము ధూళి వ్యాపిస్తుండడంతో ఈ గ్రామస్తులు కూడా నష్టపోతున్నారు. సమీప గ్రామాల్లో భూగర్భ జలాలు కూడా క్వారీ నిర్వహణతో కలుషితమవుతున్నాయనే వాదనలు వినిపిస్తున్నాయి.

పంట తోటలు నాశనమయ్యాయి



క్వారీ చుట్టూ నాకు మూడు ఎకరాల భూమి వుంది.దీనిలో జీడి మామిడి చెట్లు వున్నాయి.క్వారీ యజమాని ఏటా ఎకరానికి మూడు వేల రూపాయలు శిస్తు గా చెల్లిస్తున్నారు.పెంచాలని కోరుతున్నా పట్టించుకోవడం లేదు.మొదటి నుంచి ఆ మూడు వేల రూపాయలే చెల్లిస్తున్నారు.దీని వల్ల మేం తీవ్రంగా నష్టపోతున్నాం.క్వారీ పేలుళ్ళతో నా పొలాల్లోకి పెద్ద పెద్ద రాళ్ళు వచ్చి పడుతున్నాయి.దీని వల్ల కూడా నష్టం జరుగుతోంది.

పాలిక నర్సయ్య, గిరిజన రైతు

కలెక్టర్‌కు ఫిర్యాదుచేస్తాం



క్వారీ వల్ల ఏటా గ్రామపంచాయతీకి ఏ విధమైన ఆదాయం రావడం లేదు. చెల్లించాల్సిన పన్ను కట్టడం లేదు. క్వారీ చుట్టూ ఉన్న పంట భూములు నాశనమయ్యాయి. ఏటా మూడు వేల రూపాయలు శిస్తుగా ఇచ్చి యజమాని చేతులు దులుపుకుంటున్నారు. గుర్రపువలస, కరాసువలస గ్రామాల్లో పేలుళ్ల ప్రభావానికి ఇళ్లు బీటలు వారుతున్న పరిస్థితి ఏర్పడింది. శబ్ద, వాయు కాలుష్యం ఎక్కువగా వుంది. కొంతమంది రైతులు చేసిన ఫిర్యాదు మేరకు త్వరలో జిల్లా కలెక్టర్ కి ఫిర్యాదు చేస్తాను.

- ఒంటి లక్ష్మి, సర్పంచ్, కరాసువలస

పాఠశాల భవనాలు నిర్మించాలి : సిపిఎం

ప్రజాశక్తి - వీరఘట్టం

శిథిలమైన పాఠశాల భవనాలు తొలగించి, వాటి స్థానంలో కొత్తవి నిర్మించేందుకు చర్యలు తీసుకోవాలని సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు ఎం.తిరుపతిరావు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ మేరకు ఆదివారం ఒక ప్రకటన విడుదల చేశారు. మండలంలోని సంధిమానుగూడ, పెద్దూరు, జె.గోపాలపురం, కంబరవలస, అచ్చాపువలస, నర్సిపురం- గోరా తదితర పాఠశాల భవనాలు పూర్తిగా శిథిలావ్యవస్థకు చేరుకోవడంతో విద్యార్థులు చదువుకునేందు భయపడుతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. ఇప్పటికే ఆయా పాఠశాలల్లో స్లాబ్ పై నుంచి పెచ్చులు కూడా రాలుతున్నట్లు తెలిపారు. అనుకోని ప్రమాదం జరిగితే వీటిపై బాధ్యులు ఎవరని అధికారులను ప్రశ్నించారు. వీటితోపాటు చిట్టపూడివలస, రేగులపాడు, హుస్సేనపురం, పనస నందివాడ, బండ్లపాడు తదితర అంగన్వాడీ కేంద్రాలు పూర్తిగా శిథిలావస్థకు చేరుకున్నాయన్నారు. కొద్దిరోజుల కిందట పాపంపేట పాఠశాల వెనుక గోడ విద్యార్థుల్లేని సమయంలో కూలిపోవడంతో పెద్దప్రమాదం తప్పడంతో విద్యార్థుల తల్లిదండ్రులు, గ్రామస్తులు ఊపిరిపీల్చుకున్నారన్నారు. అదే సమయంలో విద్యార్థులుంటే ప్రమాదానికి బాధ్యులెవరని ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. నాడు-నేడు పాఠశాల అభివృద్ధి పేరిట నిధులు దోపిడీ తప్ప ఎక్కడా న్యాయమైన పనులు జరపలేదన్నారు. వేసిన రంగులు ఊడిపోయి ఎక్కడికక్కడే దర్శనమిస్తున్నాయని, చేసిన పనుల్లో కూడా ఎంత నాణ్యతా ప్రమాణాలు పాటించారో వీటిని చూస్తే అర్థమవుతుందన్నారు. ప్రమాదాలు జరగకముందే ప్రభుత్వం నూతన భవనాలు నిర్మించేందుకు చర్యలు తీసుకోవాలని తిరుపతిరావు డిమాండ్ చేశారు.





పార్వతీపురంలో ప్రచారం చేస్తున్న సిపిఎం నాయకులు; సాలూరులో పోస్టర్ విడుదల చేస్తున్న సిపిఎం నాయకులు

15న బహిరంగ సభను జయప్రదం చేయండి

ప్రజాశక్తి - పార్వతీపురం టౌన్

లౌకికవాదం, ప్రజాస్వామ్య పరిరక్షణ, అసమానతల్లేని అభివృద్ధి కోసం సిపిఎం ప్రజారక్షణ భేరి పేరిట ఈనెల 15న విజయవాడలో జరిగే బహిరంగ సభకు ప్రజల పెద్ద సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని సిపిఎం పట్టణ కమిటీ కార్యదర్శి గొర్లి వెంకటరమణ, సభ్యులు పాకల సన్యాసిరావు పిలుపునిచ్చారు. ఆదివారం పట్టణంలోని 24, 25వ వార్డుల్లో సిపిఎం పట్టణ కమిటీ ఆధ్వర్యంలో ప్రజా రక్షణ భేరి కరపత్రాలను ఇంటింటికీ పంపిణీ చేశారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ రానున్న రోజుల్లో జరిగే ఎన్నికల్లో బిజెపిని ఓడించడానికి ప్రతి కార్యకర్త కృషి చేయాలన్నారు. రాష్ట్రంలోని వైసిపి ప్రభుత్వం కేంద్ర ప్రభుత్వ విధానాలను వేగంగా అమలు చేస్తుందని విమర్శించారు. అందులో భాగంగానే విద్యుత్ ఛార్జీలను పెంచి ప్రజలపై భారాలు మోపారన్నారు. నిత్యవసర ధరలు రోజురోజు పెరిగిపోతున్నప్పటికీ నియంత్రించడంలేదని విమర్శించారు. కార్యక్రమంలో శిరేల శ్రీను, బుగత రామ, జవ్వాది పోలిరాజు, హనుమంతు శ్రీను, సామంతుల గౌరి, పద్మనాభం అప్పలరాజు, పద్మనాభం శ్రీను, పొన్నాడ బ్రహ్మానందం, పొన్నాడ శ్రీను, అప్పలనాయుడు, గొర్లి పార్వతమ్మ, కంగటి ధనలక్ష్మి, గొర్లి లక్ష్మి, తదితరులు పాల్గొన్నారు.

సాలూరు: ప్రజారక్షణ భేరి బస్సు యాత్ర ముగింపు సందర్భంగా ఈనెల 15న విజయవాడలో నిర్వహించనున్న బహిరంగ సభ కు ప్రజలు తరలిరావాలని సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు ఎన్వై నాయుడు కోరారు. ఆదివారం సిపిఎం పట్టణ కమిటీ నాయకులు టి.రాముడు, టి.ఇందు, నాగమణితో కలిసి ఆయన గోడపత్రికలను విడుదల చేశారు. ఈనెల15న విజయవాడలో నిర్వహించనున్న బహిరంగ సభలో సిపిఎం జాతీయ కార్యదర్శి సీతారాం ఏచూరి, పొలిట్‌బ్యూరో సభ్యులు బివిరాఘవులు, రాష్ట్ర కార్యదర్శి శ్రీనివాసరావు మాట్లాడుతారన్నారు. ఈ సభకు అధిక సంఖ్యలో ప్రజలు హాజరు కావాలని నాయుడు కోరారు.

కొమరాడ : అసమానతలు లేని రాష్ట్రం జిల్లా అభివద్ధి కోసం ఈనెల 15న విజయవాడలో జరిగే సిపిఎం ప్రజారక్షణభేరి ముగింపు బహిరంగ సభ కు భారీగా ప్రజలు కదిలి రావాలని సిపిఎం నాయకులు కొల్లి సాంబమూర్తి పిలుపునిచ్చారు. ఈమేరకు కరపత్రాలను గుమడ సంత, నాగవల్లి అవతల గ్రామాల్లో ప్రచారం నిర్వహించారు. సిపిఎం నాయకులు ఉపేంద్ర, లక్ష్మణరావు, వెంకట్రావు, అప్పారావు, లచ్చం, పోలినాయుడు, సుబ్బారావు పాల్గొన్నారు.


తండాలో తాగునీటి వెతలు

- మరమ్మతులకు గురైన మోటార్
- బావిపైనే ఆధారం
- ఫిర్యాదు చేసినా పట్టించుకోని అధికారులు

ప్రజాశక్తి - వీరఘట్టం

వేసవి ప్రారంభం కాక ముందే గిరిజన తండాలో తాగునీటి సమస్య తలెత్తిందంటే అధికారుల పనితీరు ఏవిధంగా ఉందో అర్థం చేసుకోవచ్చు. మీ గ్రామాలకు అదిచేస్తాం... ఇదిచేస్తామని పాలకులు ఉపన్యాసాలకే పరిమితమవుతున్నారు తప్ప కనీసం మంచినీటి సౌకర్యం కల్పించడంలో పూర్తిగా విఫలమయ్యారని గిరిజనులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

మండలంలోని గదబవలస పంచాయతీ పరిధిలోనే శాంతిగూడ, కొత్తగూడ గిరిజన గ్రామాలు ఉన్నాయి. ఇక్కడ సుమారు 20 కుటుంబాల గిరిజనులు జీవనం సాగిస్తున్నారు. ఈ గ్రామంలో ఒక బోరు, ఒక నేల బావి ఉన్నాయి. అయితే బోరు ద్వారా వచ్చే నీరు తాగేందుకు పనికిరావడం లేదని, ఇతరాత్ర అవసరాలకు మాత్రమే ఉపయోగిస్తున్నట్లు గిరిజన మహిళలు వి.అనిత, సుస్మిత తెలిపారు. ఐటిడిఎ ఆధ్వర్యంలో కొన్నేళ్ల కిందట బోరుబావితో పాటు మోటర్ సదుపాయం కూడా కల్పించారు. వీధిలో పైప్‌లైన్ కూడా ఏర్పాటు చేశారు. అధికలోడు ప్రభావం మోటార్‌కు సంబంధించిన మిషన్ పోయిందని, మరమ్మతులు చేపట్టాలని పంచాయతీ పాలకవర్గానికి రెండు నెలల నుంచి ఫిర్యాదు చేసినా కనీసం చర్యలు తీసుకోవడం లేదని గిరిజనులు వి.శ్రీను, మిన్నారావు, ఎ.సుబ్బారావు, శోభన్ వాపోతున్నారు. మోటారు మొరాయించి రెండు నెలలు కావస్తుండడంతో కనీస చర్యలు చేపట్టక పోవడంతో అందుబాటులో ఉన్న బావిలోని కలుషిత నీటిని తోడుకొని తీసుకొచ్చి దాహార్తితో పాటు వంటలు కూడా చేయాల్సిన పరిస్థితి ఏర్పడుతుందని చెబుతున్నారు. కలుషిత నీటిని వినియోగించడం వల్ల వ్యాధుల బారినపడి వేలాది రూపాయలు వెచ్చించి రోగాలు నయం చేసుకోవాల్సిన పరిస్థితి ఏర్పడుతుందని గిరి పుత్రులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి మరమ్మతులకు గురైన మిషన్ బాగు చేసి వినియోగంలోకి తీసుకురావాలని గిరిజనులు కోరుతున్నారు.



ఉత్సవ విగ్రహంలా దర్శనమిస్తున్న బోరు బావి



అంబేద్కర్ విగ్రహం వద్ద నిరసన తెలుపుతున్న టిడిపి నాయకులు

దళితులపై దాడులు అమానుషం

ప్రజాశక్తి - గుమ్మలక్ష్మీపురం

రాష్ట్రంలో రోజురోజుకు దళితులపై దాడులు జరుగుతున్నా ప్రభుత్వం కనీసం కూడా స్పందించకపోవడం విచారకరమని కురుపాం నియోజకవర్గ టిడిపి ఇన్‌ఛార్జి తోయక జగదీశ్వరి అన్నారు. దళితులపై దాడులను ఖండిస్తూ గుమ్మలక్ష్మీపురంలో అంబేద్కర్ విగ్రహానికి వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వైసిపి నాలుగున్నర ఏళ్ల పాలనలో దళితులపై అనేక రకాలుగా దాడులు జరుగుతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. దోషులపై ప్రభుత్వం చర్యలు తీసుకోవడంలో పూర్తిగా విఫలమైందని విమర్శించారు. కార్యక్రమంలో టిడిపి నాయకులు పాడి సుదర్శన్ రావు, సొంటేనే రాజేష్, తాడంగి దమయంతి, పత్తిక మోహన్‌దాస్ ఉన్నారు.

చేప పిల్లలు పంపిణీ


ప్రజాశక్తి - సీతంపేట

మండలంలోని సోమగండి, పెద్దూరు, పాత పనుకువలసలో గల చెరువుల్లో 27,800 చేప పిల్లలు విడుదల చేశారు. ఈ సీడ్ స్టాకింగ్ ప్రోగ్రాంలో ఐటిడిఎ ఎపిఒ రోషి రెడ్డి, సర్పంచ్ లు, పంచాయతీ కార్యదర్శులు, సచివాలయం గ్రామమత్స్య సహాయకులు విజేత, ఆదినారాయణ, ప్రత్యూష పాల్గొన్నారు.

సమస్యలపై ఐక్య పోరాటం

ప్రజాశక్తి - పాలకొండ

సమస్యల పరిష్కారానికి ఉపాధ్యాయులంతా ఐక్యంగా పోరాడాలని ఎపిటిఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.భానుమూర్తి అన్నారు. ఆదివారం ఎపిటిఎఫ్ మండల శాఖ ఆధ్వర్యంలో తమ్మినాయుడు కళాశాల ఆవరణలో అధ్యక్షులు శాసపు వాసుదేవరావు అధ్యక్షతన సర్వసభ్య సమావేశం జరిగింది. ఈ సందర్భంగా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మాట్లాడుతూ విద్యా రంగంలో వచ్చిన మార్పులు కొంత మేలు చేకూర్చేలా ఉన్నా కూడా మరికొన్ని ఇబ్బందికరంగా ఉన్నాయని అన్నారు. మండల ప్రధానకార్యదర్శి ఎం.సంపత్ కుమార్ కార్యదర్శి నివేదిక సమర్పించగా కమిటీ ఆమోదం తెలిపింది. జిల్లా ప్రధాన కార్యదర్శి బాలకకృష్ణ, ఉమ్మడి శ్రీకాకుళం జిల్లా పూర్వపు అధ్యక్షులు అచ్యుత రావు ఉపాధ్యాయుల సమస్యలపై అనంతరం మండల నూతన కార్యవర్గం ఎన్నికైంది. అధ్యక్షులుగా వాసుదేవరావు, ప్రధాన కార్యదర్శిగా గోగుల సూర్యనారాయణ, ఉపాధ్యక్షులుగా జి.ఆంజనేయులు, వి.నాగమణి, బి.ఉమామహేశ్వరరావులు, కార్యదర్శులుగా కోటేశ్వరరావు, కష్ణారావు, రామలక్ష్మి, రవి కుమార్ ఎన్నిక అయ్యారు. ఈ సందర్భంగా బదిలీపై వెళ్లిన ఇరవై మంది ఉపాధ్యాయులకు ఘనంగా సన్మానం చేశారు. జిల్లా ప్రధానకార్యదర్శి బాలకష్ణ, జిల్లా అధ్యక్షులు అచ్యుతారావు, ఉపాధ్యక్షులు బివి రమణ చేతుల మీదుగా ఉపాధ్యాయులకు సన్మానం జరిగింది.



సమావేశంలో మాట్లాడుతున్న సిఐటియు నాయకులు బివి రమణ

మధ్యాహ్న భోజన కార్మికుల సమస్యలు పరిష్కరించాలి

ప్రజాశక్తి -గరుగుబిల్లి

మధ్యాహ్న భోజన కార్మికుల సమస్యలు పరిష్కరించాలని సిఐటియు జిల్లా కార్యదర్శి బివి రమణ డిమాండ్ చేశారు. మండల కేంద్రంలో మధ్యాహ్న భోజన కార్మిక సంఘం ఆధ్వర్యాన ఆదివారం మండల సదస్సు జరిగింది. ఈ సదస్సులో ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం రోజురోజుకు విద్యార్థులకు మధ్యాహ్న భోజనంలో నూతన మెనూ అమలు చేస్తుందని, కానీ దానికి అనుగుణంగా బడ్జెట్ పెంచడం లేదని పెరుగుతున్న పని భారానికి అనుగుణంగా మధ్యాహ్న భోజన కార్మికులకు జీతాలు పెంచడం లేదని విమర్శించారు. పెరుగుతున్న దరలకు అనుగుణంగా విద్యార్థులకు చెల్లిస్తున్న మెనూ చార్జీలు పెంచాలని డిమాండ్ చేశారు. ఉద్యోగ భద్రత కల్పించాలని, యూనిఫాం ఇవ్వాలని, సరిపడా వంట పాత్రలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వం మధ్యాహ్న భోజన నిర్వాహకుల సమస్యలు పరిష్కారం చేయకపోతే రాష్ట్ర వ్యాప్తంగా ఆందోళన చేపడతామని హెచ్చరించారు. కార్యక్రమంలో మధ్యాహ్న భోజన కార్మిక సంఘం మండల అధ్యక్ష కార్యదర్శులు పి.పావని, బి.సూర్యం, నాయకులు రోహిణి, అన్నపూర్ణమ్మ తదితరులు పాల్గొన్నారు.

పార్కుకు పోటెత్తిన పర్యాటకులు

ప్రజాశక్తి - సీతంపేట

ఆదివారం సెలవు దినం కావడంతో స్థానిక ఎన్టీఆర్ అడ్వెంచర్ పార్క్ పర్యాటకులతో పోటెత్తింది కార్తీక మాసం వస్తుండడంతో పర్యాటకులు అధిక సంఖ్యలో రావడం ప్రారంభమైంది. జిల్లా నలుమూలల నుండి కాకుండా ఇతర జిల్లాల నుంచి కూడా పర్యాటక ప్రాంతాలు సందర్శించడానికి పర్యాటక ప్రేమికులు తరలివస్తున్నారు. అధికంగా మెట్టు గూడ జలఎంరాతం, ఆడలి యు పాయింట్, జగత్ పల్లి రిసార్ట్స్, సున్నపుగెడ్డ జలపాతాలు అధికంగా సందర్శిస్తున్నారు. అడ్వెంచర్ పార్కులో జలవిహార్ వద్ద బోటు షికారు చేస్తున్నారు. ఆల్ ట్రైన్‌ల్లో పర్యాటకులు పార్క్ చుట్టూ చక్కెర్లు కొట్టారు. స్కై సైకిల్ ఎక్కి ఆకాశంలో చక్కెర్లు కొట్టారు. అనంతరం ఆనంద్ విహార వద్ద డాన్సులు వేసి కేరింతలు కొట్టారు.

సవరకుసిమిలో భవిష్యత్తుకు గ్యారెంటీ

ప్రజాశక్తి - సీతంపేట

పాలకొండ నియోజక వర్గ నాయకులు పడాల భూదేవి ఆధ్వర్యంలో సవరకుసిమితో బాబు ష్యూరిటీ భవిష్యత్తుకు గ్యారెంటీ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ బాబుతోనే ఆంధ్రప్రదేశ్‌కు భవిష్యత్ ఉందని ప్రజలంతా నమ్ముతున్నారన్నారు. టిడిపి మ్యానిఫెస్టోలో పథకాలు, వైకాపా వైఫల్యాలను ఇంటింటికి తీసుకెళ్ళాలని కార్యకర్తలను సూచించారు. భవిష్యత్తు కోసం రానున్న ఎన్నికల్లో టిడిపికి ఓటు వేసేలా అందరూ కలసికట్టుగా పనిచేయాలన్నారు.



గ్రామంలో ర్యాలీ నిర్వహిస్తున్న టిడిపి నాయకులు